ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# మన ప్రజాప్రతినిధి
తెలుగు దిన పత్రిక
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :195 ఆదివారం మే 10 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## కరీంనగర్ బంద్ ఉద్రిక్తం.. గంగుల కమలాకర్ అరెస్ట్

- క్యాంప్ కార్యాలయంపై దాడికి నిరసనగా బంద్
- ఇంటి వద్ద నుంచే మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్టు





కరీంనగర్, మే 9 (మనప్రజాప్రతినిధి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన కరీంనగర్ బంద్ కొనసాగుతోంది. నగరంలో పలు ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించింది. బీజేపీ గూండాలు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గంగుల కమలాకర్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం ఆయన్ను ఇంటి వద్ద నుంచే అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంగుల కమలాకర్‌తో పాటు మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏనుగు రవీందర్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టులకు నిరసనగా పార్టీ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. నగరంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా స్వామ్య హక్కులను అణచి వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రశాంతంగా బంద్ నిర్వహిస్తున్నప్పటికీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇదిలా ఉండగా నగరంలో పలు దుకాణాలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేయబడ్డాయి. బంద్ నేపథ్యంలో రవాణా కూడా కొంత మేర ప్రభావితమైంది. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు

## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది
## హరీశ్ రావు



- +కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలపై తీవ్ర ఆగ్రహం
- +సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యమని విమర్శ
- +తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్న ఆరోపణ

2

## ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు



-కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ
-ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బహుళ ప్రణాళికలు
-మూసీ పునరుజ్జీవంతో కాలుష్య నియంత్రణపై దృష్టి
-తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

హైదరాబాద్, మే 9 (మనప్రజాప్రతినిధి): ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నగరాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న నగరీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలు తగ్గవని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం

2

## పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం



-దసరా లోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరిక
-సాగునీటి సాధన కోసం తెలంగాణ రక్షణ సేన పోరాట పిలుపు
-కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
-మహిళలు, యువతకు పెట్టుబడి సహాయం అందిస్తామని కవిత హామీ

షాద్‌నగర్, మే 9 (మనప్రజాప్రతినిధి): పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేకపోవడంపై తెలంగాణ రక్షణ సేన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పాలమూరు, రంగారెడ్డి ప్రాంత ప్రజలతో కలిసి సాగునీటి సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో నేతలు మాట్లాడారు. కృష్ణానది సమీపంలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిని వినియోగించుకునే అవకాశం లేకుండా పాలకులు వ్యవహరించారని విమర్శించారు. సాగునీటి హక్కుల కోసం ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో కూడా ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి చూపలేదని మండిపడ్డారు. పాలమూరు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించబోమని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా పండుగలోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించారు. ఆలోపు పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో విస్తృత పాదయాత్ర చేపట్టి

2

## తెలంగాణలో బీజేపీదే తదుపరి లక్ష్యం
## ఈటల రాజేందర్



-మోదీ సభకు భారీగా ప్రజలు రావాలి
-కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
-మల్కాజిగిరి నుంచి లక్ష మంది హాజరు అవుతారని వెల్లడి

హైదరాబాద్, మే 9 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో బీజేపీదే తదుపరి మజిలీ అని, రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని ఈటల తెలిపారు. దేశాన్ని అస్థిరపరిచే శక్తులను అణచివేసి అఖండ భారతాన్ని సురక్షితంగా ఉంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న నాయకుడిగా మోదీ తెలంగాణకు వస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చినా రెండేళ్లలోనే ప్రజలు విసిగిపోయారని ఈటల విమర్శించారు. తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉండాలంటే, అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో పెరుగుతోందన్నారు.రేపు జరిగే మోదీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివస్తున్నారని ఆయన తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి నుంచి లక్ష మంది సభకు హాజరు కానున్నారని వెల్లడించారు. ప్రజలకు ఎండ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సభకు ప్రజలను తరలించేందుకు వెయ్యి బస్సులను ఏర్పాటు చేసినట్లు ఈటల తెలిపారు. గత ఎన్నికల సమయంలో



2

## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది హరీశ్ రావు

మెదటి పేజీ తరువాయి



సిద్దిపేట, మే 9 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతుల పరిస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా వారాల తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. రైతుల బాధలపై ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు.ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరి కోతలు ప్రారంభమయ్యే ముందే మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సంచులు, లారీలు, నిధులు సిద్ధం చేసేవారని గుర్తు చేశారు. రైతులను కంటికి రెప్పలా కాపాడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో రైతులు ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల సన్ ఫ్లవర్ దిగుబడి సాధిస్తున్నప్పటికీ కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టిందని విమర్శించారు. తీరా ఆ పరిమితి మేరకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కోటా ముగిసిందనే కారణాలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండ పడ్డారు.పొద్దున్న లేస్తే పంటల మార్పిడి చేయాలని రైతులకు సూచించే ప్రభుత్వం, రైతులు సన్ ఫ్లవర్, మక్కలు, శనగలు, జొన్నలు పండిస్తే వాటిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవైపు పంటల మార్పిడి చేయమని చెప్పి, మరోవైపు ఆ పంటలను కొనకుండా రైతులను నష్టాల్లోకి నెట్టడం ద్వంద్వ వైఖరి కాదా అని విమర్శించారు. జొన్న పంటను గతంలో ప్రతి ఏడాది కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం జొన్నలు కొనడం లేదని, సన్ ఫ్లవర్ కొనుగోళ్లు పూర్తిగా ఆపేసిందని ఆరోపించారు. మక్కలకు కూడా పరిమితులు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.సంచులు కూడా రైతులే తెచ్చుకోవాలని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. రైతులకు సంచులు సరఫరా చేసే సామర్థ్యం లేని ప్రభుత్వం ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినలేదని అన్నారు. వడ్లను రైస్ మిల్లులు తీసుకోవడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలో తరుగు వేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. బీ-గ్రేడ్ పేరుతో ఎకరాకు వందల రూపాయల నష్టం వస్తోందన్నారు. ఒకవైపు తరుగులు, మరోవైపు మిల్లుల్లో కటింగ్స్‌తో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని హరీశ్ రావు విమర్శించారు. బోనస్ ఎగ్గొట్టడమే కాకుండా తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నకోడూరులో సన్ ఫ్లవర్ కొనుగోళ్లు నిలిపివేయడంతో కుప్పల కింద పంట చెడిపోతోందన్నారు. మద్దతు ధర రూ. 7,720 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ. 5 వేలకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు ఎకరాకు వేల రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. రైతుబంధు లేక, మద్దతు ధర అందక రైతులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో గత నాలుగు రోజులుగా నిల్వలు పేరుకుపోయి లారీలు లేక పంటలను లోపలికి అనుమతించడం లేదని హరీశ్ రావు అన్నారు. ఒక రైతు పంట అమ్ముకోవాలంటే తేమ పరీక్షకు వారం, సంచుల కోసం వారం, కాంటాకు వారం, లారీల కోసం వారం ఇలా నెల రోజుల పాటు కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతులను ఆదుకోని ప్రభుత్వం ప్రజల నమ్మకం కోల్పోతుందని హరీశ్ రావు హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు

మెదటి పేజీ తరువాయి



ఉందని సీఎం పేర్కొన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యలను తగ్గించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని సీఐయూఆర్, పీఐయూఆర్, ఆర్ఏఆర్ఈ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొం దించామని ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని తయారీ రంగ అభివృద్ధికి అనుకూల ప్రాంతంగా, ఆ తర్వాతి గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు నగర సంస్కృతితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. నగరంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడమే కాకుండా ఆటోలను ఉచితంగా ఈవీ వాహనాలుగా మార్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమమని స్టాండింగ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు.

## పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం

మెదటి పేజీ తరువాయి



ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడానికి పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.సభలో పలువురు నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## తెలంగాణలో బీజేపీదే తదుపరి లక్ష్యం ఈటల రాజేందర్

మెదటి పేజీ తరువాయి



మల్కాజిగిరి ప్రజలు మోదీపై చూపిన ప్రేమ మరువలేనిదని అన్నారు. అదే ఉత్సాహంతో ఈసారి కూడా సభను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోని 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, త్వరలో తెలంగాణ కూడా 23వ రాష్ట్రంగా మారుతుందని ఈటల ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు, దాడులు బీజేపీ సంస్కృతి కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజల ఆదరణ పెరుగుతోంది

-విజయవాడలో విక్రయ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి వంగలపూడి అనిత
-రైతులతో మాట్లాడి పంటల వివరాలపై ఆరా
-రసాయన రహిత ఆహారంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
-ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం






విజయవాడ, మే 9 (మనప్రజాప్రతినిధి): విజయవాడలోని ఎస్ఎల్వీ గ్రీన్ మెడోస్ వద్ద వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల గురించి రైతులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రజల్లో ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన గణనీయంగా పెరుగుతుండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. రసాయనాలు లేని స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఆరోగ్యంపై చైతన్యం పెరుగుతున్న నేపథ్యంలో సహజ పద్ధతుల్లో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఏర్పడుతోందన్నారు.ప్రకృతి వ్యవసాయం రైతులకు కూడా లాభదాయకమవుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. తక్కువ వ్యయంతో సాగు చేయడంతో పాటు నేల సారాన్ని కాపాడటంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగడంలో ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని చెప్పారు. రైతులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవడంతో సహజ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం పెరుగుతోందని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు. రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలను సాకారం చేస్తాం మోదీ





కోల్‌కతా, మే 9 (మనప్రజాప్రతినిధి): పశ్చిమ బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవడం సహజమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన కలలను సాకారం చేయడానికి ఎలాంటి ప్రయత్నాన్నీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మఖన్‌లాల్ సర్కార్‌ను కలిసినట్లు మోదీ తెలిపారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీతో కలిసి పనిచేసిన మఖన్‌లాల్ సర్కార్ జమ్మూ కాశ్మీర్ ఉద్యమ సమయంలో అరెస్టు కూడా అయ్యారని గుర్తు చేశారు.పశ్చిమ బెంగాల్ అంతటా బీజేపీ పార్టీ బలోపేతానికి మఖన్‌లాల్ సర్కార్ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రజల మధ్య పనిచేసిన ఇలాంటి నాయకులు బీజేపీకి స్ఫూర్తిగా నిలుస్తారని మోదీ అన్నారు. కార్యకర్తల అంకితభావం వల్లే పార్టీ ప్రజల్లో మరింత బలపడుతోందని అభిప్రాయపడ్డారు.పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటాన్ని పార్టీ శ్రేణులు చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సుశాసనం లక్ష్యంగా కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ నాయకత్వం వెల్లడిస్తోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. బెంగాల్ రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త మార్పులకు దారితీస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం





కోల్‌కతా, మే 9 (మనప్రజాప్రతినిధి): పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు చోటుచేసుకుంది. భారతీయ జనతా పార్టీ తరఫున తొలి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే భారీగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు అక్కడికి చేరుకున్నారు. బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందంటూ బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.ప్రమాణ స్వీకారం అనంతరం సువేందు అధికారి ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. వేదికపై ఉన్న జాతీయ నాయకులతో కరచాలనం చేశారు. బెంగాల్ అభివృద్ధి, పరిపాలనలో కొత్త దిశగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 294 స్థానాల్లో 207 స్థానాలు గెలుచుకుని ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా కొనసాగుతున్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ముగింపు పలికాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధిపత్యానికి గండి పడడంతో బెంగాల్ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. సువేందు అధికారి ప్రస్తుతం బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిదో వ్యక్తిగా నిలిచారు. ఆయన వయస్సు 55 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. ఆయన తండ్రి సిసిర్ అధికారి గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. విద్యార్థి దశలో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సువేందు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి తర్వాత కాలంలో ఆమెకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. నందిగ్రామ్ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది. రెండు సార్లు మమతాపై పోటీ చేసి విజయం సాధించిన ఆయన ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పదవిని అధిరోహించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# కడపలో రెండు వర్గాల మధ్య ఘర్షణ



కడప, మే 9 (మనప్రజాప్రతినిధి): కడప నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్ వద్ద రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. వాగ్వాదంతో ప్రారంభమైన వివాదం క్రమంగా ఉద్రిక్తరూపం దాల్చి ఇరువర్గాలు రాళ్లు, కర్రలు, బాటిళ్లతో పరస్పరం దాడులకు దిగినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం రెండు వర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం కొనసాగినా ప్రారంభంలో పోలీసులు పరిస్థితిని పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం ఘర్షణ తీవ్రరూపం దాల్చడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. రోడ్లపై పరుగులు తీస్తూ ప్రజలు అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయారు. పలుచోట్ల వాహనాలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్ నిర్వహించి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అనంతరం అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని నియంత్రించారు. ఈ ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై మరోసారి చర్చకు దారితీసింది. స్థానికులు ప్రాంతంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు కారణాలపై ఆరా తీస్తూ సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం

# తమిళనాడు రాజకీయాల్లో కొత్త ట్విస్ట్





చెన్నై, మే 9 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు రాజకీయాల్లో ప్రభుత్వ ఏర్పాటు చుట్టూ ఉత్కంఠ నెలకొంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మద్దతు వ్యవహారం కొత్త వివాదానికి దారితీసింది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం పార్టీ ఎమ్మెల్యే తమకు మద్దతు ఇచ్చినట్లు టీవీకే ప్రకటించగా, అది నకిలీ లేఖ అంటూ ఏఎంఎంకే తీవ్ర ఆరోపణలు చేసింది. టీటీవీ దినకరన్ నేతృత్వంలోని ఏఎంఎంకే నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే ఎస్ కామరాజ్ టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు ఓ లేఖ విడుదలైంది. లేఖపై కామరాజ్ సంతకం చేస్తున్న వీడియోను కూడా టీవీకే సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ లేఖను గవర్నర్‌కు కూడా సమర్పించినట్లు సమాచారం. అయితే ఆ లేఖ పూర్తిగా నకిలీదని దినకరన్ ఆరోపించారు. కామరాజ్ సంతకం చేస్తున్న వీడియోను కృత్రిమ మేధ సాయంతో సృష్టించారని పేర్కొన్నారు. తమ పార్టీ టీవీకేకు ఎలాంటి మద్దతు ప్రకటించలేదని స్పష్టం చేశారు.తమ ఏకైక ఎమ్మెల్యే కనిపించడం లేదని, ఆయనను రాజకీయ ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని దినకరన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించిన ఆయన, గిండి రేంజ్ ఏసీపీ కార్యాలయానికి వెళ్లి అధికారికంగా ఫిర్యాదు చేశారు. మరోవైపు టీవీకే మాత్రం దినకరన్ ఆరోపణలను ఖండించింది. తాము ఎవరితోనూ బేరసారాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తమపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించింది. ఈ పరిణామాల మధ్య దినకరన్ మరో కీలక అడుగు వేశారు. తమ ఎమ్మెల్యే కామరాజ్‌తో కలిసి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ను కలిసి, ఎడప్పాడి కే పళనిస్వామి నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని తెలిపారు. దీంతో తమిళనాడు రాజకీయాల్లో పరిస్థితులు మరింత ఆసక్తికరంగా మారాయి.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో రక్షణ ఏర్పాట్లు

మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట మే 09:చేగుంట మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కోతుల బెడద నివారణకు పట్టణానికి చెందిన శ్రీ వెంకటేశ్వర మెడికల్ హాల్ యాజమాని చొల్లేటి సుజాత, కృష్ణమూర్తి, కుటుంబసభ్యులు రక్షణ ఏర్పాట్లను తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . ఆలయ పరిసరాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా, కోతుల నుండి ఉపశమనం పొందేలా ఈ సౌకర్యాలను కల్పించామని అన్నారు. దైవ కార్యాల పట్ల వారు చూపిస్తున్న చొరవను, వారి సేవా గుణాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా వారిని అభినందించారు.



# ఇండ్ల గణనకు ప్రజలు సహకరించాలి




మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట, మే 09: మెదక్ జిల్లా, చేగుంట మండలం, 'సెన్సెస్-2027' మొదటి దశలో భాగంగా మే 11 నుండి ప్రారంభం కానున్న ఇండ్ల గణన ప్రక్రియపై చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో శనివారం గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శివప్రసాద్ మాట్లాడుతూ, గణన కోసం వచ్చే ఎనిమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ ప్రక్రియకు ప్రభుత్వ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా గణన సమయంలో గోప్యతా నియమాల దృష్ట్యా ఆధార్ నంబర్ గాని, ఓటీపీ గాని చెప్పవలసిన అవసరం లేదని, కేవలం ఇంటి నంబరు, ఇంటికి సంబంధించిన వివరాలు మాత్రమే తెలపాలని సూచించారు. అలాగే ప్రజలు స్వయంగా 'సెల్ఫ్ ఎనిమరేషన్' చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ భూమేష్, సర్పంచ్ నర్సింహా, ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ సెక్రటరీలు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా, మండలంలోని ప్రతి ఓటరు తమ ఓటర్ మ్యాపింగ్, ప్రోజెనీ వివరాలను తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని తాసిల్దార్ సూచించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం బూత్ స్థాయి అధికారుల ( బి ఎల్ వో ) ద్వారా నిర్వహించబడుతోందని, వివరాలు అందించని యెడల భవిష్యత్తులో ఓటు తొలగించబడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు ఈ విషయాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా వారు అన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేసిన బిజెపి నాయకులు



మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట మే 9:చేగుంట మండలం చందాయిపేట్ గ్రామం లో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశానుసారం గ్రామానికి చెందిన బండ రాజు కు సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బిజెపి నాయకులు అందజేశారు. . ఈ కార్యక్రమంలో చేగుంట మండల బిజెపి ప్రధాన కార్యదర్శి జూకంటి శోభన్, బూత్ బిజెపి అధ్యక్షుడు బుద్ద రమేష్, ప్రధాన కార్యదర్శి శిలబలిష్, మాజీ బూత్ అధ్యక్షుడు వంశీ గౌడ్, ఉపాధ్యక్షుడు శాలిపేట స్వామి, సంఘని రాజు తదితరులు పాల్గొన్నారు

# 2003 DSCఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి పిఆర్టీయు




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 9 :2003 డిస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని డివిజన్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం హేయమైన చర్య అని పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు మేడి సతీష్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్ తీవ్రంగా ఖండించారు. 01-09-2004కు ముందు నోటిఫికేషన్ జారీ చేసి అనంతరం నియామకాలు పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుని అమలు చేస్తోందని వారు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 ఉత్తర్వుల ప్రకారం పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో కూడా అదే విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇటీవల ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి తో టీజీజాక్ నాయకత్వం జరిపిన చర్చల్లో కూడా ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. కోర్టు తీర్పులు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల సానుభూతితో వ్యవహరించి కోర్టు ఉత్తర్వుల మేరకు 2003 డిస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పిఆర్టీయు నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని వారు స్పష్టం చేశారు.

# నిరుపేద యువతి వివాహానికి సహాయం చేసిన బెంద్రం తిరుపతిరెడ్డి



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 09 మే :రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో జంగంరెడ్డీ పల్లె గ్రామంలో పేద కుటుంబ నాంపల్లి తిరుపతి -రమ గార్ల కుమార్తే భార్గవి ( ఆరాధ్య) - రాకేశ్ గార్ల వివాహనికి టేక్ మంచాలు 10000 పది వేల రూపాయల వస్తువులను బి టి ఆర్ ఫౌండేషన్ ద్వారా సహాయం అందజేసిన బెంద్రం తిరుపతిరెడ్డి. ఈ సందర్భంగా బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబలా కుమార్తెల వివాహలకి ఎల్లపుడు సహాయం చేస్తాను అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ పండుగ సునీత తిరుపతి ,నాంపల్లి బాలయ్య, పండుగ మహేష్ ,మల్లయ్య విజయ్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణ కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్లో జరిగిన గుజ్జుక రవి,కుమార్తె మాధవి వివాహ వేడుకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అలాగే మద్దూరు,నర్మెట లో జరిగిన వివాహాది శుభకార్యాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,వారికి శుభాకాంక్షలు తెలియజేసి,దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

# కుల వ్యవస్థ -బీసీ సమస్య గ్రంధాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రను పరిశీలించినప్పుడు బీసీలు అనేక శతాబ్దాలుగా సామాజిక,ఆర్ధిక,విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో వెనుకబాటుకు గురైన వాస్తవం స్పష్టంగా కనిపిస్తుంది.ఈ పరిస్థితులను సరిదిద్దడం భారత రాజ్యాంగం ఆధారంగా ఏర్పడిన పార్ల మెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఉన్న ముఖ్యమైన బాధ్యత.పరిపాలన వ్యవస్థలో సమన్యాయం పాటించినప్పుడే రాజ్యాంగ ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరుకుంటాయి. ఫలాలను అందరికీ అందించేందుకు ప్రభుత్వ వ్యవస్థలు,పాలకులు తను బాధ్యతను గుర్తించి పనిచేయాల్సిన అవసరం ఉంది.ఏ సమాజమైనా నిజమైన నాగరికతను పొందాలంటే కులాలు, మతాలు,జాతులు ఆధారంగా ఏర్పడిన అసమానతలు తగ్గి సమానత్వం పెరగాలి, సమాన హక్కులు,సమాన అవకాశాలు కలిగిన సమాజాన్ని నిర్మించుకోవడం భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన ఒక గొప్ప లక్ష్యం.ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా సమాజంలో చైతన్యం పెరగడం అత్యంత అవసరం.చరిత్రను పరిశీలిస్తే మానవ సమాజ అభివృద్ధి క్రమంలో వ్యవసాయ నాగరికతకు భారత ఉపఖండం ముఖ్యమైన కేంద్రంగా నిలిచింది.ఆ చారిత్రక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి మార్గంలో నడవాలి.అప్పుడు మాత్రమే అభివృద్ధికి నిజమైన అర్ధం వస్తుంది.ఈ నేపథ్యంలో "కుల వ్యవస్థ-బీసీ సమస్య" అనే గ్రంథాన్ని సుమారు 1150 పేజీల విస్తృతంగా సిద్ధం చేయడం ఒక ముఖ్యమైన ప్రయత్నం. బీసీల చరిత్ర, సమస్యలు,సామాజిక పరిస్థితులు మరియు అభివృద్ధి మార్గాలపై చర్చను విస్తరించేందుకు ఈ గ్రంథం ఉపయోగపడుతుందని నేను నమ్ముతున్నాను.ఈ విలువైన గ్రంథాన్ని సిద్ధం చేసిన సంపాదకులు పావని నాగరాజు కి నా అభినందనలు తెలియజేస్తూ,ఈ పుస్తకం బీసీల అభివృద్ధికి మరియు సామాజిక చైతన్యానికి ఉపయోగపడాలని ఆశిస్తున్నాను.